బాల్ బ్యాడ్మింటన్ విజేతలకు డా. సూర అభినందనలు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్: జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో విజయం సాధించిన జిల్లా క్రీడాకారులను పారిశ్రామిక వేత్త, ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు అభినందించారు. ఈనెల 17 నుంచి 21 వరకు నాగపూర్‌లో జరిగిన జూనియర్ నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ బాలుర జట్టు ప్రథమ స్థానం, బాలికల జట్టు ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నాయి. ఇందులో శ్రీకాకుళం జిల్లా నుంచి బాలుర విభాగంలో జి.లక్ష్మణ, ఎస్.హేమంత్, బాలికల విభాగంలో ఎస్.నందిని, ఎం.గాయత్రిలు ఎచ్చెర్ల మండలానికి చెందినవారు. పోటీలకు వెళ్లిన క్రీడాకారులకు స్పాన్సర్‌గా సూర వ్యవహరించారు. విజయం సాధించి జిల్లాకు వచ్చిన క్రీడాకారులు శ్రీనివాసరావును కలిశారు.

మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దు

విశాలాంధ్ర - మందస: మాదక ద్రవ్యాలకు విద్యార్థులు బానిస కావొద్దని ఎస్ఐ క్రిష్ణ ప్రసాద్ కోరారు. శుక్రవారం మందస మండలం బాలిగాం ఆదిత్య జూనియర్ కళాశాలలో సంకల్పం కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు క్రమ శిక్షణతో మెలిగి ఉన్నత స్థాయికి ఎదగాలని తల్లిదండ్రులకు విద్యా సంస్థకు మంచి పేరు తేవాలని కోరారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల విద్యార్థులు మోటారు వాహనాలు నడపడం చట్టవ్యతిరేకం అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు స్టేషన్ సిబ్బందితో పాటు కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

విశాలాంధ్ర - ఎల్ఎన్ పేట: మండలంలోని శ్యామలాపురం జంక్షన్ ప్రధాన రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం విజయనగరం నుండి ఒడిస్సా వెళ్తున్న కారు శ్యామలాపురం వద్ద చెట్టుకు ఢీకొనడంతో ఇరువురికి తీవ్ర గాయాలవడంతో స్థానికులు రిమ్స్‌కు తరలించారు.

ఉద్యోగాల ఖాళీల భర్తీకి కృషి
ఎమ్మెల్సీ నర్తు

విశాలాంధ్ర -కవిటి: గ్రామ సచివాలయంలో ఉద్యోగాలు ఖాళీ భర్తీకి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం కవిటి-3 (చిన్న ఎర్ర గోవిందపుట్టుగ) గ్రామ సచివాలయంను సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీ ఈఓ వీరభద్ర స్వామిని సచివాలయ ఉద్యోగుల ఖాళీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు జిల్లా కలెక్టర్‌కు లేఖ ద్వారా తెలియజేస్తానని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కడియాల పద్మ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కార భారతిలో ఓటర్ల దినోత్సవం

విశాలాంధ్ర - సోంపేట: పట్టణంలోని సంస్కారభారతి డిగ్రీ కళాశాలలో శుక్రవారం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. అనేక మంది విద్యార్థులు ఎన్నికల కమిషన్ లోగో ఆకృతిలో కూర్చుని ఆకర్షించారు. 75 సంవత్సరాల భారత ఎన్నికల సంఘం సేవలను స్మరించుకుంటూ ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికలు, ఓటింగ్‌పై విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరామ్ అవగాహన కల్పించారు.

బాలికలను ఆదరించండి

విశాలాంధ్ర -కంచిలి: ఆడపిల్లలను ప్రతి ఒక్కరు ఆదరించి ఆప్యాయత, అనురాగాలు పంచిపెట్టాలని కంచిలి మండలం బూరగాం జెడ్పీ ఉన్నత పాఠశాల బాలికలు కోరారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా పలువురు బాలికలు 8వ తరగతి హిందీ పాఠ్యాంశంలో సారాంశాన్ని స్ఫూర్తిగా తీసుకుని మాట్లాడారు. బాలిక సంరక్షణకు ప్రభుత్వం పలు చర్యలు చేపడుతున్నా సమాజంలో కొంత మంది కామాంధులు సాగిస్తున్న అసాంఘిక చర్యలపై ఆందోళన వ్యక్తం చేశారు. అటువంటి మూర్ఖులకు భగవంతుడు మంచి మనసు ఇవ్వాలని కోరారు.

కేజీబీవీలో జాతీయ బాలికల దినోత్సవం

విశాలాంధ్ర - హిరమండలం: హిరమండలం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సమీపంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేజీబీవీ ప్రిన్సిపాల్ సంపతిరావు కృష్ణ వేణి మాట్లాడుతూ నేటి బాలికలే రేపటి మహిళలు అని, బాలికలు నేటి తరం అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. మంచి సమాజం మహిళలతోనే సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది బాలికలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో ఇద్దరి అరెస్ట్

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం: మరో ఇద్దరు గంజాయి అక్రమ రవాణాదారులను పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకుని వారి నుండి 16.230 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎం.చిన్నం నాయుడు వెల్లడించిన వివరాల ప్రకారం కవిటి మండలం కొజ్జిరియ కూడలి వద్ద కవిటి సబ్ ఇన్‌స్పెక్టర్ ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఒడిశా గంజాం జిల్లాకు చెందిన సురేష్ చంద్ర గౌడ, రాకేష్ పాదిలిలు ఆంధ్రా మీదుగా గుజరాత్‌లో సూరత్‌కు గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించి వారిపై కేసు నమోదు చేశారు.

పాడి పశువులతో నిరంతర ఆదాయం

విశాలాంధ్ర - ఆమదాలవలస: పాడి పశువుల ద్వారా నిత్యం రైతులకు ఆదాయం చేకూరుతుందని, పశువులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించటం అవసరమని ఏడీ డా. ఆనందరావు తెలిపారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలో టీం వన్ వైద్యాధికారి డాక్టర్ వై.హేమలత ఆధ్వర్యంలో తిమ్మాపురంలో శిబిరం ఏర్పాటు చేశారు.

డాక్టర్ ఓంకార్ ఆధ్వర్యంలో గరిమెళ్ళ కొత్తవలసలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రైతులకు అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ శిబిరంలో గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, సాధారణ పశువులకు చికిత్సలు, లేగ దూడలకు ఏలిక పాముల నివారణ మందులు తదితరాలపై వివరించారు. ఈ శిబిరంలో ఎస్.కృష్ణమూర్తి, రిటైర్డ్ జూనియర్ వెటరినరీ ఆఫీసర్, స్వాతి, లైవ్స్టాక్ అసిస్టెంట్, ఉమా మహేశ్వరరావు, హాస్పిటల్ అటెండెంట్, డా. స్వర్ణకీర్తి, మోహనరావు సంచార పశువైద్య సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్ సుమతి పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టానికి విరుద్ధంగా జీవో 117 సవరణలు
- ఎస్టీయు జిల్లా అధ్యక్షులు ఎస్వి రమణమూర్తి

విశాలాంధ్ర - రణస్థలం: మూడో తరగతి విద్యార్థి పక్క గ్రామం పాఠశాలలో చదివేలా తరలించడం సరికాదని ప్రైమరీ విద్యను అందించే పాఠశాల ఆవాస ప్రాంతానికి ఒక కిలోమీటర్ దూరంలో ఉండాలని విద్యా హక్కు చట్టం చెబుతుంటే దానికి విరుద్ధంగా కూటమి ప్రభుత్వం జీవో 117 సవరణలతో మూడు, నాలుగు, ఐదు తరగతులను సమీప పాఠశాలలో విలీనం చేయమంటుందని ఇదేమి నిర్ణయం అని ఎస్టీయు జిల్లా అధ్యక్షులు ఎస్వి రమణమూర్తి ప్రశ్నించారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం ఎస్టీయూ ప్రాంతీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇలాంటి ఉత్తర్వులు ఎవరి ప్రయోజనం కోసం ఇస్తున్నారో అర్థం కావడం లేదని విమర్శించారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం చేసే నిర్ణయాలు చెయ్యాలి తప్ప సామాన్యులకు ప్రభుత్వ విద్య దూరం చేసే నిర్ణయాలు మానుకోవాలని అన్నారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ మాట్లాడుతూ విద్యార్థులను తరలించకుండా మోడల్ ప్రైమరీ పాఠశాలలు ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా ఉన్నతీకరణ చేయాలి తప్ప విద్యార్థులను మ్యాపింగ్‌కు స్వస్తి పలికాలన్నారు. ఉన్నత పాఠశాలలో రెండు మీడియంలలో బోధన ఉండాలన్నారు. హైస్కూల్ ప్లస్‌లను కొనసాగించాలని అలాగే పెండింగ్ బకాయిలు విడుదలకు కూడా నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు, రణస్థలం, లావేరు, ఎచ్చెర్ల మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు ఎ.జగన్, వేణు, జి.శ్రీనివాసరావు, యన్.లక్ష్మణరావు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం ఎంఈఓ త్రినాధరావుకు వినతి సమర్పించారు.

గోశాలలతో రైతులకు ప్రయోజనాలు

విశాలాంధ్ర - సంతబొమ్మాళి: గోశాలలతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని సాగునీటి సంఘం అధ్యక్షుడు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి రెడ్డి అప్పన్న అన్నారు. శుక్రవారం నరసాపురంలో చిన్న రవికి ప్రభుత్వం మంజూరు చేసిన గోశాలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మోది రామచంద్రరావు, మండల టీడీపీ పార్టీ కోశాధికారి సవ్వాన ప్రసాదరావు, పంచాయతీ కార్యదర్శి రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

26న బైక్ ర్యాలీని జయప్రదం చేయండి
- కార్మిక సంఘాల సమన్వయ కమిటీ పిలుపు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్: కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలు, లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా శ్రీకాకుళంలో 26న నిర్వహించే బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల సమన్వయ కమిటీలు పిలుపునిచ్చాయి. శ్రీకాకుళం సిఐటియు కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఎఐటియుసి జిల్లా గౌరవ సలహా దారులు చిక్కాల గోవిందరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సింహాచలం, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి పి.ప్రసాదరావు, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సీపాన వెంకట్రావులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 13నెలలు పాటు సాగిన రైతు ఉద్యమం సందర్భంగా రాతపూర్వకంగా ఇచ్చిన వాగ్దానాలను గాలికి వదిలివేయడం దుర్మార్గమని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన సహకార చట్టం, వ్యవసాయ సాంకేతిక చట్టం రైతాంగాన్ని కార్పొరేట్ కంపెనీల పెత్తనం క్రిందకు తెచ్చేందుకు చేసినవే అని దుయ్యబట్టారు. మద్దతు ధరలు గ్యారెంటీ చట్టం, రైతులు, వ్యవసాయ కార్మికుల రుణ విముక్తి చట్టం, ఆహార భద్రత చట్టం కొనసాగింపు, ఉపాధి హామీ పథకం విస్తరణ, కౌలు రైతులకు రక్షణ కల్పించడంతోపాటు, కార్మికులకు నష్టకరమైన కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్లను రద్దు చేయించడం కోసం మరింత తీవ్రంగా పోరాడాల్సి ఉందన్నారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు, ఉద్యోగులు కార్మికులు శ్రీకాకుళం 7రోడ్ల జంక్షన్ నుండి సూర్య మహల్ మీదగా రామలక్ష్మణ జంక్షన్ వరకు జరుగు మోటార్ బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు ఎ.సత్యం, ఆర్.ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు వినతులు వెల్లువ
- తొలిసారి హాజరైన నాలుగు మండలాల అధికారులు
- త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు మార్గనిర్దేశం
- అలసత్వం వహించవద్దని అధికారులకు హెచ్చరిక

విశాలాంధ్ర - టెక్కలి/కోటబొమ్మాళి: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందించడం జరుగుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం కోటబొమ్మాళి పార్టీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి తమ సమస్యలు విన్నవించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వీలున్నంత త్వరగా ప్రజలకు మేలు చేసేవిధంగా సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధులలో అలసత్వం లేకుండా విధులు నిర్వహించాలని సూచించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన, మెరుగుదలే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. పార్టీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమానికి నాలుగు మండలాల అధికారులు హాజరయ్యారు. ఈ విధానం నిర్వహించడం ఇదే తొలిసారి. దీనితో మంచి ఫలితాలు ప్రజలకు అందాయి. సమస్యలు తెలిపిన వెంటనే అక్కడే ఉన్న అధికారులకు తక్షమే పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. ప్రధానంగా నూతన నివాసాలు, పింఛన్లు, ఉపాధి అవకాశాలు, రహదారులు మంజూరు చేయాలని ప్రజలు కోరారు. కోటబొమ్మాళి మండలంకు చెందిన నలుగురు క్షేత్ర సహాయ కులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్, రెవెన్యూ, రహదారులు, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేజీబీవీలో సామాజిక తనిఖీలు

విశాలాంధ్ర-పొందూరు: మండలంలోని లోలుగు కేజీబీవీలో శుక్రవారం డిఆర్పి పద్మలత ఆధ్వర్యంలో సామాజిక తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పన, విద్యార్థినుల చదువు, ఆరోగ్యం, విద్యార్థులకు అందజేస్తున్న మెనూ పరిశీలించారు. అలాగే స్టాక్ రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించారు. అనంతరం తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య, ఎస్ఎంసి చైర్మన్ ఏ.కిరణ్ కుమారి, వైస్ చైర్మన్ పారంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: ఓటు వినియోగంతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఓటు నమోదు కార్యక్రమంపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు నమోదు, వినియోగించుకోవడం రెండూ ముఖ్యమేనన్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, కొవ్వాడ అణుపార్క్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎస్వీ లక్ష్మణమూర్తి మాట్లాడుతూ ఓటు నమోదు ప్రక్రియలో యువత భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి తహశీల్దార్ బి.గోపాల్, డీటీ హేమసుందర్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ డి.వనజ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి. అడ్డయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. అనూరాధ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఓటు విలువపై విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు.



రాజుల చెరువును పరిశీలించిన ఆర్డీఓ
పంచాయితీ, రెవెన్యూ, వంశధార అధికారులతో సమీక్ష

విశాలాంధ్ర - నరసన్నపేట: పట్టణంలో రాజుల చెరువును ఆర్డీఓ సాయి ప్రత్యూష శుక్రవారం పరిశీలించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్.జి.టి)లో ఒక న్యాయవాది వేసిన పటిషన్‌కు సంబంధించి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీఓ సందర్శించి, రెవెన్యూ, పంచాయితీ, నీటిపారుదల శాఖాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాజుల చెరువు పేరు రికార్డుల్లో లేదని, గ్రామ కంఠంలో ఉందని రెవెన్యూ అధికారులు తెలిపారు. అలాగే నీటిపారుదల అధికారులు మాట్లాడుతూ రాజుల చెరువు మా రికార్డుల్లో కూడా గ్రామ కంఠంగానే ఉందని, చెరువు క్రింద ఆయకట్టు లేదని వివరించారు. అనంతరం ఆర్డీఓ అధికారులతో చెరువును పరిశీలించారు. మండల సర్వేయర్ అప్పలస్వామి, పంచాయితీ ఈఓ పి.ద్రాక్షాయిణి మాట్లాడుతూ గొట్టిపల్లి రెవెన్యూ పరిధిలో ఉన్న చెరువు విస్తీర్ణం 13.58ఎకరాలని, చెరువు గట్టుపై గత 2007వ సంవత్సరంలో అప్పటి అధికారులు కొంతమంది పేదలకు పట్టాలు, పొజిషన్ ధృవపత్రాలు మంజూరు చేశారని, అలాగే సుమారు 10ప్రభుత్వానికి చెందిన కార్యాలయాలు ఉన్నాయన్నారు. దీనితో పాటు కూరగాయల దుకాణాలు చెరువు గట్టుపై ఉన్నాయని తెలిపారు. ఈ విషయమై ఆర్డీఓ మాట్లాడుతూ పంచాయితీ, రెవెన్యూ, నీటిపారుదల శాఖకు చెందిన అధికారులు ఇచ్చిన వివరణను జిల్లా కలెక్టర్‌కు నివేదిక రూపంలో అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయితీ అధికారి భారతి సౌజన్య, తహశీల్దార్ టి.సత్యన్నారాయణ, ల్యాండ్స్, సర్వే డిపార్ట్‌మెంట్ ఏ.డి ఆర్.విజయ్‌కుమార్, డివిజినల్ అధికారి ఎ.వెంకటేశ్వరరావు, వంశధార ఏఈ ఎస్.హరీష్, రెవెన్యూ అధికారులు అన్వేష్, పి.సాయిరాం, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

అక్షరాస్యత మనందరి లక్ష్యం
వయోజన విద్యాశాఖ డిడి వెంకటరమణ

విశాలాంధ్ర - జలుమూరు: గ్రామస్థాయిలో అక్షరాస్యత శాతం పెంచాలని అది మనందరి బాధ్యత అని వయోజన విద్యాశాఖ శ్రీకాకుళం జిల్లా సహాయ సంచాలకులు ముద్దాడ వెంకటరమణ అన్నారు. శుక్రవారం జలుమూరు, సారవకోట మండల కేంద్రాలలో జరిగిన ఉల్లాస్ వాలంటరీ ఒక్కరోజు శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో అక్షరాస్యత కోసం ప్రభుత్వం కోట్ల రూపాయల ఖర్చు చేసి అనేక కేంద్రాల ద్వారా అక్షర క్రాంతి ద్వారా కార్యక్రమాలు చేపట్టిందని గుర్తు చేశారు. జలుమూరు మండలంలో శిక్షణలో పాల్గొన్న సభ్యులందరికీ అభ్యాసన పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కొమరాడ అప్పలనాయుడు, పంచాయతీ విస్తరణ అధికారి పొన్నాడ ఉమామహేశ్వరరావు, మండల ఇంజనీరింగ్ అధికారులు శ్రీధర్ పలువురు సభ్యులు పాల్గొన్నారు. అలాగే సారవకోటల ఎన్ఆర్‌జీఎస్ కార్యాలయంలో శుక్రవారం ఉల్లాస వాలంటరీల శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వయోజన విద్యాశాఖ సహాయ సంచాలకులు డివి రమణ, ఎంపీడీవో మోహన్ కుమార్, మండల విద్యాశాఖ అధికారి మొద్దు వెంకటరమణ పాల్గొన్నారు.

చెత్త సంపద తయారీ కేంద్రం పరిశీలన

విశాలాంధ్ర - పోలాకి: మండల కేంద్రంలో చెత్త సంపద కేంద్రాన్ని శుక్రవారం జిల్లా డీఎల్‌పీఓ ఐవి రమణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త సంపద కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని శానిటేషన్ సిబ్బందికి సూచించారు. అనంతరం పరిసరాలు పర్యావరణ పరిరక్షణ కోసం పరిసరాలు చుట్టు మామిడి దానిమ్మ తదితర మొక్కలను నాటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మజ్జి రమణమ్మ, పంచాయతీ కార్యదర్శి చంద్రరావు, శానిటేషన్ సిబ్బంది కృష్ణవేణి, బాలాజీ, దుర్గాప్రసాద్, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

పీఎం ఇంటర్న్ షిప్ వినియోగించుకోండి

విశాలాంధ్ర - కొత్తూరు: పీఎం ఇంటర్న్‌షిప్‌ను నిరుద్యోగులు వినియోగించుకోవాలని ఎంపీడీఓ నీరజ తెలిపారు. ఉపాధి, ఉద్యోగాల కల్పనకు చదువుకున్న యువత మండల పరిషత్ కార్యాలయంలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ నెల 25, 26 తేదీల్లో ప్రత్యేక నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పదో తరగతి, ఆపై చదువుకున్న వారు అర్హులన్నారు.

డ్రైవర్లకు, హెల్పర్లకు 'ఉచిత కంటి పరీక్షలు'

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్: రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం జిల్లా నెహ్రూ యువజన కేంద్రంలో ఉప రవాణా కమిషనర్ ఎ. విజయసారథి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి టి.వి.బాలమురళీ, నెహ్రూ యువజన కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ కెవి ఉజ్వల్ సంయుక్తంగా స్కూలు బస్సు డ్రైవర్లకు, హెల్పర్లకు, ఆటోరిక్షా, క్యాబ్ డ్రైవర్స్‌కు "ఉచిత కంటి పరీక్షలు" నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శశిధర్ ఆసుపత్రి, త్రివేణి ఆసుపత్రి సిబ్బంది, డాక్టర్ అనుష పాలొన్నారు. మొత్తం 235మందికి ఈ వైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో మోటారు వాహన తనిఖీ అధికారులు పి.వి.గంగాధర్‌రావు, ఆర్.అనిల్, కె.శిరీష పాల్గొన్నారు.

ఐతమ్ 'ఐఐసి'కు 4 స్టార్ ర్యాంక్



విశాలాంధ్ర - టెక్కలి: భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ 2023 - 2024 విద్యా సంవత్సరంలో ప్రకటించిన ఐఐసి ర్యాంకుల్లో ఐతమ్‌కు 4 స్టార్లు వరించాయని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2018 నుండి ఆదిత్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ పేరుతో ఇన్స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ సెల్ (ఐఐసి) ఉద్యోగ, ఉపాధి, ఉత్పాదక రంగాల్లో విద్యార్థులు పురోభివృద్ధి సాధించుటకు చేస్తున్న కృషిని అభినందిస్తూ ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసిటిఈ) చైర్మన్ ప్రొఫెసర్ టి.జి.సీతారాం, ఎంఓఈ ఛీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డాక్టర్ అభే జెరే, ఎంఓఈ ఇన్నోవేషన్ సెల్ అసిస్టెంట్ డైరెక్టర్ దిపన్ సాహులు ఈ మేరకు ర్యాంకింగ్ ధృవపత్రాన్ని జారీ చేసినట్టు డైరెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థుల అభ్యున్నతికి ఆయా కళాశాలలు ఐఐసి కేంద్రాల ద్వారా చేస్తున్న కృషిని అభినందిస్తూ ప్రతీ ఏటా కేంద్ర విద్యాశాఖ గరిష్టంగా 5 స్టార్లు వరకు ర్యాంక్‌లను ప్రకటిస్తుందని ఇప్పటి వరకు ఐతంకు వచ్చిన ర్యాంక్‌లో ఇదే అత్యున్నతమైనదని డైరెక్టర్ తెలిపారు. దేశవ్యాప్తంగా 14,725 ఇంజినీరింగ్ కళాశాలలు ఐఐసి విభాగంలో తమ పేర్లను నమోదు చేసుకొనగా వీటిలో 5455 సెంటర్లు ఉత్సాహంగా పని చేస్తున్నాయని వాటిలో ఐతమ్ ఒకటి కావడం గర్వకారణంగా ఉందన్నారు. విద్యార్థుల సృజనాత్మకతను పెంపొంపొందించుటకు ఐతమ్ యాజమాన్యం అనేక క్లబ్బులను కళాశాలలో ఏర్పాటు చేసి ప్రొత్సహిస్తుండగా ఐఐసికి ప్రత్యేకించి కేంద్ర విద్యాశాఖ, ఏఐసిటిఈ వంటి ప్రతిష్టాత్మకమైన సంస్థల గుర్తింపు లభించుటకు కృషి చేస్తున్న ఐతమ్ ఐఐసి సెంటర్ అధ్యక్షులు డాక్టర్ గుడ్ల సతీష్ కుమార్ బృందాన్ని ఐతమ్ యాజమాన్యంతో పాటు డైరెక్టర్ ప్రొఫెసర్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

విశాలాంధ్ర-పలాస: మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి మరియు జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆదేశాల మేరకు చైల్డ్ హెల్ప్ డెస్క్ సూపర్ వైజర్ బాల సరస్వతి ఆర్.పి.ఎఫ్ సిబ్బంది ప్రధాన్, సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం పలాస రైల్వే స్టేషన్ ఆవరణలో జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాట్ ఫాంలో రైలు ప్రయాణకులకు బాలికల రక్షణ గురించి బాలలపై జరిగే లైంగిక దాడుల నిర్మూలన తదితరాలపై అవగాహన కల్పించారు. బాలికలు తెలియని వ్యక్తుల మాటలు విని మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని అత్యవసర సమయంలో టోల్ ఫ్రీ నెంబర్ 1098 కు సంప్రదించాలని సూచించారు.

ఆడది అంటే అబల కాదు ఆదిపరాశక్తి
- ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం: ఆడది అంటే అబల కాదు ఆదిపరాశక్తి, బాల్యం నుండే చట్టాలపై అవగాహన అవసరం, మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ అన్నారు. శుక్రవారం జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల రక్షణ విభాగం ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా కళాశాల వద్ద నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ సూర్య మహల్ కూడలి వద్ద ముగిసింది. ఈ సందర్భంగా గొండు మాట్లాడుతూ బాల్య వివాహాలు వ్యతిరేకించాలని, ధైర్యంతో ముందుకు రావాలన్నారు. భేటీ బచావో - భేటీ పడావో వంటి కార్యక్రమంతో బాలికల ప్రాముఖ్యత పట్ల ప్రజలలో అవగాహనా కల్పించడానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తెలియజేశారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి కె వి రమణ, దిశా ఏఎస్ఐ రేణుక రాణి, డిప్యూటీ డిఇఓ కళాశాల విద్యార్థినిలు పాల్గొన్నారు.

టీచరమ్మ అవతారమెత్తిన జడ్పీ చైర్పర్సన్

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జడ్పీ చైర్పర్సన్ పిరియా విజయ శుక్రవారం టీచర్ అవతారమెత్తారు. ఈ సందర్భంగా 10వ తరగతి గదిలో విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులకు చిన్న, చిన్న ప్రశ్నలు అడుగుతూ సమాధానాలు రాబెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు మనో ధైర్యంతో, మానసిక ధైర్యంతో పరీక్షలకు సిద్ధం కావాలని తెలిపారు. మరో నెలలో పబ్లిక్ పరీక్షలు ఉన్నందున ప్రణాళికా బద్ధంగా చదివితే 10కి 10 పాయింట్లు తెచ్చుకోవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎస్.రామకృష్ణ, సర్పంచ్ బి.శ్రీరామ్ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు దుద్ది సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చల్లవానిపేటలో పశు వైద్యంపై అవగాహన

విశాలాంధ్ర-జలుమూరు: మండలం చల్లవానిపేట గ్రామంలో శుక్రవారం జలుమూరు పశు వైద్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ పంచ రెడ్డి రామచంద్రరావు ప్రారంభించారు. రైతుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నటువంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు. ఇటీవల మన గ్రామంలో పాడి అభివృద్ధి కోసం గోశాల ఏర్పాటు చేశామని రైతుల కోసం ప్రభుత్వం ఇస్తున్న పథకాలను ప్రజలు సహకరించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారిని ముద్దాడ దీప్తి. సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరం

విశాలాంధ్ర-జలుమూరు: విద్యార్థినిలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాల్సి బాధ్యత ఉందని ఐసిడిఎస్ పర్యవేక్షణ అధికారులు సునీత సీతారత్నం అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం మండల కేంద్రం జలుమూరు కేజీబీవీ పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మాట్లాడారు. నేటి బాలికలే రేపటి పౌరులు అనేక రంగాలలో అభివృద్ధి సాధించగలరని వారు సూచించారు. ముందుగా బాల్య వివాహాలు రద్దు వివిధ చట్టాలపై అవగాహన తల్లిదండ్రుల చూచిన ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని వారు కోరారు. వీరితోపాటు కేజీబీవీ ప్రత్యేక అధికారి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే గోవిందరావు పర్యటన

విశాలాంధ్ర-జలుమూరు: పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు శనివారం నియోజకవర్గ పరిధి ఎల్లంపేట, కొత్తూరు, హిరమండలం పలు మండలాల పరిధిలో వివిధ గ్రామాల్లో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాలు ఉచితపశువైద్య అవగాహన సదస్సులో పాల్గొంటారని కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని మండలాల్లో అభిమానులు కార్యకర్తలు అధికారులు, అభిమానులు విరివిగా పాల్గొవాలని సిబ్బంది కోరారు.

బీమా సౌకర్యాన్ని వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-కవిటి: కొబ్బరి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం, కొబ్బరి బోర్డు (సిడిబి) అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియ లిమిటెడ్ ఆధ్వర్యంలో కోకోన్ ఫామ్ ఇన్సూరెన్స్ పథకంను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాధనశాఖ అధికారిని మాధవీలత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు తమ తోటల్లో ఉన్నటువంటి 4 నుంచి 15 సంవత్సరాలలోపు ఉన్న ఆరోగ్యకరమైన కొబ్బరి చెట్లకు మరియు 16 నుంచి 60 ఏళ్ల లోపు ఉన్న కొబ్బరి చెట్లకు ఒకటి నుండి మూడు సంవత్సరాలకు ఇన్సూరెన్స్ చేసుకోవచ్చునని తెలిపారు. ఇన్సూరెన్స్ చేసుకున్న రైతులకు విపత్తులలో నష్టం జరిగితే ఒక్కో చెట్టుకు రూ.900 నుంచి రూ.1750 వరకు బీమా పరిహారం అందుతుందని తెలిపారు. ఒక్కో చెట్టుకు ఎంత మొత్తంలో ప్రీమియం చెల్లించాలో దగ్గరలో ఉన్న రైతు సేవా కేంద్రాల అధికారులు లేదా ఉద్యానవన శాఖాధికారి సంప్రదించాలని తెలిపారు.

ముంచుతున్న మంచు ప్రభావం

విశాలాంధ్ర-టెక్కలి: మండలంలో స్థానిక పరిసర గ్రామ ప్రాంతాలలో వేకువజామున మంచు ముంచుతున్న ప్రభావం అధికంగా కనిపిస్తుంది. శుక్రవారం వేకువజామున టెక్కలిలో వివిధ జంక్షన్ లు వద్ద మంచు దట్టంగా కమ్ముకున్న దృశ్యాలు కనిపించాయి. జనవరి నెల ఆఖరి వరకు కూడా మంచు ప్రభావం ఉండడంతో మామిడి పంట పూత దెబ్బతినే అవకాశం ఉందని, మినప, పెసర పంటలు కూడా దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోపక్క మంచు ప్రభావంతో గ్రామీణ ప్రాంత రహదారులు వాహనదారులకు కనిపించకపోవడంతో ఏం జరుగుతుందోనని బయటికి వెళ్లాలంటే భయభ్రాంతులకు గురవుతున్నట్లు స్థానిక ప్రజలు అంటున్నారు.

ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం

విశాలాంధ్ర-నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ, పిజి కళాశాలలో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల స్త్రీ సాధికారితా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, డా.పి.లత మాట్లాడుతూ 2008వ సంవత్సరంలో మనదేశంలో బాలికల దినోత్సవం నిర్వహించారని, మహిళల పట్ల వివక్షత, లైంగిక వేధింపులు, దౌర్జన్యం, సాధికారత సాధనలో ఎదురయ్యే సమస్యల పట్ల విధ్యార్థినులకు అవగాహన కల్పించటమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, శాంతి హేమ్, స్త్రీ సాధికారిత సంస్థ, కో-ఆర్డినేటర్, పూజా భరద్వాజ్, కళాశాల అధ్యాపకులు, పవిత్ర, రెయ్యమ్మ, పల్లవి, కృష్ణవేణి, డా.జి.రవికుమార్, డా.పి.అన్నాజీరావు, పి.సిహెచ్ వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంబటికి పూర్తి అదనపు బాధ్యతలు

విశాలాంధ్ర-సోంపేట: సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎఫ్ఎసి ప్రిన్సిపాల్గా, తెలుగు లెక్చరర్గా పని చేస్తున్న అంబటి మోహనరావుకు రెగ్యులర్ ప్రిన్సిపాల్గా పదోన్నతి కల్పించి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కళాశాల సిబ్బంది, విద్యార్థులు మోహనరావుకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

బంగారు వర్తకులు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-సోంపేట: సోంపేట పట్టణంలో బంగారం దుకాణం వర్తకులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని ఎస్సై లవరాజు పేర్కొన్నారు. పట్టణంలో బంగారం వర్తకులతో శుక్రవారం సమావేశమయ్యారు. కొంత కాలంగా దుండగులు బంగారం షాపులపై దృష్టి పెట్టి చోరీలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అటువంటి ఘటనలు సోంపేటలో జరగకుండా వర్తకులు తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. సీసీ కెమెరాలను దుకాణాల వద్ద ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

'పద్మావతి' విద్యార్థులకు 'సంతూర్' స్కాలర్ షిప్ విడుదల

విశాలాంధ్ర-నరసన్నపేట: స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాల విధ్యార్థినులకు విప్రో కేర్ సంస్థ వారి సంతూర్ స్కాలర్ షిప్ నిధులు విడుదలయ్యాయని కళాశాల డైరక్టర్, సిహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చదువుకోవాలనే కోరిక, ఆసక్తి ఉండి, కుటుంబ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ప్రతిభావంతులైన విధ్యార్థులు చదువులు కొనసాగించలేకపోతున్న వారికి సంతూర్ చేయూత అందించిందని అన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి 46మంది విధ్యార్థినులకు రూ.24వేలు చొప్పున్నా, విప్రో సంస్థ మొత్తం రూ.3.84లక్షలు విడుదల చేసినట్లు తెలిపారు. ఈ మొత్తాన్ని విధ్యార్థినుల బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లు అన్నారు. ఇంటర్మీడియట్ వరకూ ప్రభుత్వ కళాశాలల్లో చదివి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విధ్యార్థినులు ఈ స్కాలర్ షిప్కు అర్హులని, ఒక్కసారి స్కాలర్ షిప్కు ఎంపికైతే కోర్సు ముగిసే వరకూ స్కాలర్ షిప్ పొందవచ్చని తెలిపారు. స్కాలర్ షిప్ పొందిన విధ్యార్థులు ఈ మొత్తాన్ని తమ విద్య అవసరాలకు వెచ్చించాలని సూచించారు. స్కాలర్ షిప్ పొందటంపై విధ్యార్థినుల తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

సైబర్ నేరగాళ్ల వలలో చిక్కొద్దు

విశాలాంధ్ర-కవిటి: విద్యార్థులు ఎవరూ సైబర్ నేరగాళ్ల వలలో చిక్కొదని కవిటి ఎస్ఐ రవి వర్మ అన్నారు. ఈ మేరకు శుక్రవారం కవిటి కళ్యాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుట్కాపాన్ మసాలా,డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకూ దూరంగా ఉండాలని తెలియజేశారు. సెల్ఫోన్ వాడకం గూర్చి వాటిలో వచ్చే ఓటిపి నెంబరు వలన వచ్చే అనర్థాలను వివరించారు. అమ్మయిలకు గుడ్టచ్, బ్యాడ్టచ్ గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బిందుమాధవి, ఏవో రాణి, ఉపాధ్యాయ సిబ్బంది శ్రీదేవి, శ్రావణి, శ్రావ్య, సరస్వతి, భానుమతి, రాము, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయగౌరీని ఎమ్మెల్సీగా గెలిపించండి

విశాలాంధ్ర-టెక్కలి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గా పోటీ చేస్తున్న విజయ గౌరీకి మీ అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని యుటిఎఫ్ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా పట్టణంలో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి సంపత్ రావు కిషోర్ కుమార్, జిల్లా యుటిఎఫ్ సహాధ్యక్షులు కురమాన దాలయ్య, సీనియర్ కామరోడు పాలవలస ధర్మారావు, జిల్లా కార్యదర్శి బాలక శంకర్రావు, టెక్కలి మండల అధ్యక్షలు, ప్రధాన కార్యదర్శులు కొడాల గణపతి రావు, తమ్మినాన వైకుంఠరావు, ఎన్ కృష్ణారావు, మోహన రావు, నందిగాం మండల అధ్యక్షులు కుమారస్వామి యుటిఎఫ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రథసప్తమి ఉత్సవాలలో బాధ్యతలు తీసుకోండి

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: రథసప్తమి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు పట్టణ వర్తకులు స్వచ్ఛందంగా బాధ్యతలు తీసుకోవాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణ వర్తకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ వర్తకులంతా సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. సంస్కృతి కార్యక్రమాలను నిర్వహించేందుకు కృషి చేయాలని అన్నారు. పలువురు పట్టణ వర్తకులు, వ్యాపార వాణిజ్య ప్రముఖులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పని కల్పించాలి

విశాలాంధ్ర-నరసన్నపేట: జిల్లాలోని ఉపాధి కూలీలకు పని కల్పించాలని జాతీయ ఉపాధి హామీ పథకం ప్రాజెక్ట్ డైరక్టర్, బి.సుధాకర్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో 17వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఉపాధి హామీ పి.డి, సుధాకర్ మాట్లాడుతూ మస్తరులో దిద్దుబాట్లు ఉన్నా, తప్పుడు పేర్లుకు హాజరు వేసినా సంబంధిత ఫీల్డ్ అసిసెంట్లను విధుల నుండి తొలగిస్తామని తెలిపారు. అలాగే ఉపాధి పని అడిగిన ప్రతీ ఒక్కరికీ పని కల్పించాలని, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు తమ లక్ష్యాలను సకాలంలో చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి, ఆరంగి మురళీధర్, జెడ్పీటిసి ప్రతినిధి, చింతు రామారావు, ఎంపిటిసిలు, వైశ్యరాజు కేశవరాజు, నేతింటి రాజేశ్వరరావు, వైసిపి నాయకులు, రాజాపు అప్పన్న, సురంగి నర్సింగరావు, పంచాయితీ వార్డు మెంబర్లు, డి.వి.ఓ, స్వరూప రాణి, ఏపిడి, శైలజ, ఎంపిడిఓ, బి.మధుసూ ధనరావు, ఏపిఓ, యుగంధర్, ఉపాధి సిబ్బంది, అప్పలరాజు, బాలసుబ్ర హ్మణ్యం, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

షాపు దౌర్జన్యంగా తొలగించారు చంపేస్తామంటూ బెదిరింపులు

- రెండు నెలలుగా వేధింపులు
- స్థల బాధితుడు ఆవేదన

విశాలాంధ్ర-ఆమదాలవలస: పురపాలక సంఘ పరిధి మెయిన్ రోడ్ శివాలయం సమీపంలో ఉన్న తన షాపును 18 వ వార్డుకు చెందిన వ్యక్తి దౌర్జన్యంగా తన తొలగించారని స్థల బాధితుడు పుల్లెటికుర్తి వెంకట రమణ స్థానిక విలేకరుల ముందు ఆవేదన చెందారు. శుక్రవారం ఆయన విలేకరుల వద్ద తన గోడు వినిపించుకున్నారు. రెండు నెలలుగా తన ఆస్తిని వారికి ఇచ్చేయాలని లేకుంటే చంపేస్తామని బెదిరిస్తున్నారని అందుకు తగ్గ ఆధారాలు తన ఫోన్లో రికార్డు అయి ఉన్నాయని బోరుమన్నాడు. మంగళవారం రాత్రి జెసిపిలు ట్రాక్టర్ తో వచ్చి తొలగించారని షాపు వద్ద ఉన్న విద్యుత్ మీటరును పడగొట్టారని షాప్ మొత్తం కూల్చేసారని చెప్పారు. తొలగింపు అడ్డుకున్న తనను హతమారుస్తానని బెదిరించడంతో జిల్లా పోలీసు ఉన్నతాధికారిని ఆశ్రయించా నని వెంటనే స్థానిక పోలీసులు వచ్చారని అప్పటికే తన షాపు తొలగింపు జరిగిందని చెప్పారు. పోలీసులు తొలగింపు దారులను వెనక్కు పంపించారని చెప్పారు. సర్వే నెంబర్ 135 లో సుమారు రెండు సెంట్లు స్థలం 2023 సంవత్సరం జూన్ నెలలో భోగి రాజేశ్వరి భర్త లేటు ఆంజనేయు లు, వారికుమారుడు భోగి ఆనంద్ ఉభయలు వద్ద తన తండ్రి అమలారావు పేరున రిజి స్ట్రేషన్ జరిగిందని వివరించారు. అందుకు సంబంధిం చిన డాక్యుమెంట్లు, లింక్ డాక్యుమెంట్లను బహిర్గతం చేశారు. బొడ్డేపల్లి పేటకు చెందిన విజయకుమార్ అనే వ్యక్తి, పొడుగు సురేష్ కుమార్ తనకు రిజిస్ట్రేషన్ చేశారని చెబుతూ... నాపై దౌర్జన్యం చేశారని బాధితు డు ఆరోపించారు. భోగి రాజేశ్వరికి వంశ పారంప ర్యంగా వచ్చిన ఆస్తి అని అందులో పొడుగు సురేష్ కుమార్ కు ఎటువంటి వారసత్వ హక్కు లేదని వివరించారు. బొడ్డేపల్లి పేటకు చెందిన వ్యక్తి దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. స్థలం నుండి తప్పుకోకుంటే ఏ క్షణమైనా హతమారుస్తానని ఎవరు వస్తారో చూసుకో అంటూ బెదిరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కష్టార్జితంతో కొనుగోలు చేసిన ఆస్తిని దౌర్జన్యంగా దోచుకునేందుకు యత్ని స్తున్నారని వాపోయారు. అధికారులు తనకు న్యాయం చేసి తన కుటుంబానికి రక్షణ కల్పించాలని వెంకటరమణ కోరారు.

ఉపాధి లక్ష్యంగా పరిశ్రమల ఏర్పాటుకు కృషి

- పరిశ్రమకు అనుకూలమైన వనరులు
- సూపర్ క్రిటికల్ థర్మల్ ఫ్లవర్ ప్లాంట్తో అభివృద్ధి
ఎమ్మెల్యే రవికుమార్

విశాలాంధ్ర - ఆమదాలవలస: నియోజకవర్గంలో గల యువతకు ఉపాధి లక్ష్యంగా పరిశ్రమలు ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తున్నట్టు స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శుక్రవా రం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావే శంలో మాట్లాడారు. నియోజకవర్గంలో అపారమైన వనరులు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకొని ముందుకు వెళితే అభివృద్ధితోపాటు యువతకు ఎం తో ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఎన్నిక ల్లో ఇచ్చిన హామీలు ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబా బు అడుగులు వేస్తున్నారని ఆ దిశగా ఆమదాలవలస నియోజకవర్గంలో 3200 కిలో వాట్స్ సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంటేషన్ 30 వేల కోట్ల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి సుము కత వ్యక్తం చేశారని తెలిపారు. మొదటి దశలో 15 వేల కోట్ల రూపాయలతో 16 వందల మెగా వాట్స్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్న ట్టు చెప్పారు. ప్లాంట్ ఏర్పాటు దిశగా ప్రయత్నంలో భాగంగా గురు వారం విజయవాడకు చెందిన జెన్కో ఇంజనీర్లు బృం దం సరుబుజ్జిలి మండలం వెన్నెల వలస, బూర్జ మండలం మదనాపురం బొడ్లపాడు ప్రాంతాల్లో పర్య టించి ప్లాంట్ కు అనువైన స్థల పరిశీలన చేశారన్నారు. సరుబుజ్జిలి మండలం వెన్నెల వలస వద్ద థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు స్థలము అనువైనదిగా అధికారులు గుర్తించారని దీనిపై అధికారులు డీటెల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారు చేయనున్నారని త్వరలో కార్యరూపం దాల్చి న నున్నదని తెలిపారు. థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు కు నీటి వనరులతో పాటు ఉత్పత్తి అయ్యే విద్యుత్ సరఫరాకు గ్రిడ్ లైన్లు ఉండాలని అన్నారు.

పరిశ్రమకు అనుకూలమైన వనరులు

సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు అవ సరమైన అన్ని వనరులు నియోజకవర్గంలో ఉన్నాయ ని, పరిశ్రమకు అవసరమైన నీరు 750 మెగావట్ల పవ ర్ గ్రిడ్లైన్ లైను ఉన్నాయని రహదారి వ్యవస్థ మెరుగు పరచనున్నామని రవికుమార్ వివరించారు. ఈ పవర్ ప్లాంట్ కు రోజుకు 100 క్యూసే క్కుల నీటి అవసరం ఉంటుందని వంశధార నాగావళి నది అనుసంధాన కాలువ పూర్తయితే ఆరువందల క్యూసిక్కుల నీరు ప్రవహిస్తుందని, పవర్ ప్లాంట్కు రోజుకు 100 క్యూసెక్కుల నీరు అవసరం ఉంటుందని వివరించారు. వ్యవసాయ అవసరాలకు 500 క్యూసెక్కుల నీరు ఉంటుం దన్నారు. అలాగే వెన్నెల వలస రిజర్వాయర్ నీటి నిల్వ చేసుకునేందుకు అనుకూలంగా ఉందని చెప్పారు. వెన్నెలవలసలో 800 ఎకరాల ప్రభుత్వ భూ మి ఉందని, 600 ఎకరాల ప్రైవేటు భూమి 12 మంది రైతులు చేతుల్లో ఉందని ఈ ప్రైవేట్ భూములను 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించి సేకరించనున్నట్టు అన్నారు. పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్న ప్రాంతంలో రెండు చిన్న గ్రామాలు ఉన్నా యని ఆయా గ్రామాల ప్రజలకు పునరావసం కల్పి స్తామని చెప్పారు.

అనుబంధ పరిశ్రమలు వస్తాయి

పవర్ ప్లాంట్ ఏర్పాటు ద్వారా అనుబంధ పరిశ్రమలైన మరో నాలుగు సిమెంట్ ఫ్యాక్టరీలు ఉన్నాయని తెలి పారు. నాణ్యమైన విద్యుత్తు అందించడం ద్వారా పరి శ్రమలు వృద్ధి చెంది యువతకు ఉపాధి అవ కాశాలు కలుగుతాయని రవికుమార్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్ర బాబు ఆముదాల వలసలో ఈ పరి శ్రమ ఏర్పాటుకు సహకరించారని పరిశ్రమ ఏర్పడితే నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందుతుం దన్నారు. గత పాలకులు నియోజకవర్గం విధ్వంసం చేశారని కనీసం ఏ ఒక్క పరిశ్రమను ఏర్పాటుకు ప్రయత్నం చేయలేదని విమర్శిం చారు.నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను చేస్తున్న కృషికి తోడుగా ప్రజలు తోడుగా నిలవాలని పిలుపునిచ్చారు. అభివృద్ధిని ప్రజలకు తెలిసే విధంగా పాత్రికేయులు వార్తలు రాయాలని సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు బీవీ రమణమూర్తి, కిల్లిలక్ష్మీ గోవిందం పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- ఐక్యమత్యంగా ఉంటూ సమస్యలు పరిష్కరించుకోవాలి
- ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: మత్స్యకారుల అభివృద్ధికి అన్నివిధాలుగా ప్రభుత్వం కట్టుబడి ఉందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. నగరంలోని విశాఖ ఎ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మత్స్యకార సంఘ నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ జిల్లాలో 193 కిలోమీటర్ల సుదూరమైన తీర ప్రాంతం, 11 సముద్ర తీర మండలాలు, 104 గ్రామాల పరిధిలో సుమారు 1,12,000 మంది మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు మెరుగయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగానే వలలు, సబ్సిడీ పథకాలు, వేట సామగ్రిని అందజేయనున్నట్టు తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చిన సామగ్రిని త్వరలోనే పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. మత్స్యకారులు ఐక్యమత్యంతో ఉంటూ తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. జెట్టీల నిర్మాణం చేపడతామని గత వైసీపీ ప్రభుత్వం మత్స్యకారులకు కల్లబొల్లి కబుర్లతో మభ్యపెట్టిందన్నారు. సబ్సిడీలను కూడా అందంచకుండా మత్స్యకారుల జీవితాలను అంధకారంలోకి నెట్టిందన్నారు. మత్స్యకారుల వలసల నివారణకు కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో చర్యలు చేపడుతోందని వివరించారు.

పోరాటయోధునికి.. ఉద్దానం కన్నీటి వీడ్కోలు ...

బొడ్డపాడులో మావో అగ్రనేత చలపతి అంత్యక్రియలు

విశాలాంధ్ర-పలాస: చత్తీస్ ఘడ్ ఒడిస్సా సరిహద్దు గరియ బంధ ప్రాంతంలో పోలీసులకు మావోయిస్టులకు జరిగిన ఎదురు కాల్పుల్లో మృతి చెందిన మావో అగ్రనేత చలపతిరావు అలియాస్ సుధా అంత్యక్రియలు శుక్రవారం శ్రీకాకుళం జిల్లా పలాస మండలం ఉద్యమాల పురిటిగడ్డ బొడ్డపాడు గ్రామంలో ఉద్దాన ప్రజల అశ్రునివాళుల మధ్య జరిగింది. చలపతిరావు మృతదేహాన్ని ఆయన మామయ్య బొడ్డపాడు గ్రామానికి ఉదయం 11 గంటలకు తీసుకుని రాగా అమరవీరుల స్మారక భవనం ప్రాంతంలో శవపేటికను భద్రపరిచారు. ఈ సమాచారం దావానంలా వ్యాపించడంతో ఉద్దాన గ్రామ ప్రజలు, మావోయిస్టు సానుభూతిపరులు, బొడ్డపాడు గ్రామస్తులు ఆ ప్రాంతానికి చేరుకుని చలపతిరావుకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చలపతిరావును ప్రభుత్వం హత్య చేసిందని, రాజహింసకు వ్యతిరేకంగా మేధావులు ఖండించాలని పిలుపునిచ్చారు. చలపతిరావు ఆశలను కొనసాగిస్తామని ప్రతిజ్ఞ భూనారు. ఈ కార్యక్రమంలో అమరుల బంధుమిత్రుల కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు అంజమ్మ, వై వెంకటేశ్వర్లు, కోదండ, నీలకంఠం, ధనలక్ష్మి, దానేషు, వీరస్వామి, అరుణ, కుసుమ, మద్దిల రామారావు, మద్దిల ధర్మారావులతో పాటు బొడ్డపాడు మాకన్నపల్లి మామిడిపల్లి నీలావతి గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఉద్యమానికి అంకురార్పణ.. ఉద్దానంతో అనుబంధం.. బొడ్డపాడుకు అల్లుడు..

1988 లో రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ విద్యార్థులతో కలిసి గ్రామాలకు తరలండి పిలుపు తో ఉద్దానంలో అడుగుపెట్టిన ప్రతాపరెడ్డి అలియాస్ చలపతి, సుధాకర్, సుధా ఆ తర్వాత, నగ్సల్బరీ చేయి అందుకుని ఎగిసిపడ్డ శ్రీకాకుళ సాయుధ రైతాంగ పోరాటానికి గుండెకాయగా ఉన్న ఉద్దానంలో ఉద్యమ నిర్మాణంలో భాగమయ్యాడు. ఉద్దానంలో సీఓగా పని చేసిన ప్రతాప్, సుధాకర్ సుధాగా ఉద్దానం ప్రతి ఇంటికి పరిచయమయ్యాడు. ప్రజల పక్షాన నిలబడి అనేక ఉద్యమాలు నిర్మించాడు. ఆ తర్వాత తీవ్రమైన నిర్బంధం వల్ల పీపుల్స్ వార్ పార్టీ దళాలు మైదాన ప్రాంతాలను ఖాళీ చేసి అడవుల్లోకి వెళ్ళిపోవాల్సిన పరిస్థితి వచ్చింది. సమయంలో ప్రతాప్ ఆంధ్ర ఒడిస్సా బోర్డర్ (ఏవోబీ)కి తరలివెళ్ళిపోయాడు. అనేక ఎన్ కౌంటర్ల నుంచి అత్యంత నైపుణ్యంతో తప్పించుకున్నారు. ఏది నమ్మినా దాని చివరి వరకు నడిచే గుణం ప్రతాప్ ది. ప్రస్తుతం మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడైన చలపతిరావు దాదాపు 36 ఏళ్ళలో ఒక్క క్షణం కూడా వెనకడుగు వేయకుండా సూటిగా నడుస్తూనే తనువు చాలించాడు.

మావోయిస్టు అగ్ర నేత చలపతి మృతి చందడంతో ఉద్దానం కన్నీటి జోహార్లు అర్పించింది. ఆయనతో

ఉద్దానానికి ఉన్న అవినాభావ సంబంధాన్ని గుర్తు చేసుకుంటున్నది. చిత్తూరు జిల్లాకు చెందిన ప్రతాప్ రెడ్డి బీఎస్సీ పూర్తి చేసుకున్న తర్వాత విజయనగరంలో సెరికల్చర్ శాఖలో ఉద్యోగం వచ్చింది. ధనిక కుటుంబం అయినప్పటికీ, నాస్తికత్వం లోతులు తెలుసుకోవడానికి పుస్తకాలను ఎక్కువగా అధ్యయనం చేస్తుండేవాడు. ఈ క్రమంలో పౌర హక్కుల సంఘం సీనియర్ నాయకుడు అప్పనదొరతో పరిచయం పెరిగింది. వ్యవస్థ మారాలంటే నూతన ప్రజాస్వాముక విప్లవమే మార్గమని అర్థం చేసుకున్నారు. ఏది నమ్మిన దాని చివర అంచు వరకు నడవడం వ్యక్తిత్వంగా ఉండడంతో, విప్లవ కార్యకలాపాల వైపు ఆకర్షితుడయ్యాడు. తాను విద్యార్థి కాకపోయినప్పటికీ రాడికల్స్ స్టూడెంట్స్ యూనియన్ తో కలిసి అనేక విప్లవ కార్యకలాపాలు చేస్తుండేవాడు. 1988 లో గ్రామాలకు తరలి రండి ఆర్ఎస్యూ పిలుపుతో ఉద్దానంలో అడుగుపెట్టిన ప్రతాపరెడ్డి సుమారు 20 రోజులు పాటు ఇక్కడ ఉద్దానం లోని గ్రామీణ పరిస్థితులను, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేశారు. అప్పటికే జిల్లాలో శ్రీకాకుళం గిరిజన సాయిద రైతాంగ పోరాట ఉద్యమాలు తీవ్రస్థాయిలో ఉన్నాయి. ఆ పరిస్థితుల్లో ఉద్దానం నుండి రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ విద్యార్థులతో తిరిగి వెళ్లకుండా ఇక్కడే పూర్తి కాలం విప్లవ కార్యకర్తగా మారి ఉద్దన్న ప్రాంతంలో ఉండిపోయారు. ఉద్దానంలో అనేక ఉద్యమాలు నిర్వహించి అనేక పోరాటాలకు నాయకత్వం వహించారు. అజ్ఞాత సమయంలోనే ఉద్యమాల పురిటిగడ్డగా పేరొందిన బొడ్డపాడు కు చెందిన మావోయిస్టు పోతనపల్లి రుక్మిణి అలియాస్ అరుణ అలియాస్ సుభద్రను వివాహం చేసుకొని ఉద్దాన ప్రాంతానికి అల్లుడయ్యాడు. 2016 లో జరిగిన ఎన్కౌంటర్లో సుభద్ర మృతి చెందడంతో చలపతిరావు ఏకాకయ్యారు. ఉద్దాన ప్రాంతంతో పాటు మైదాన ప్రాంతంలో అనేక మందితో అప్పట్లో సత్సంబంధాలు కలిగి ఉన్న మావో అగ్ర నేత చలపతి అలియాస్ సుధా ఈ ప్రాంతం నుండి తన విప్లవ పోరాటాలను అందుకున్న వ్యక్తి ఇక లేరు అనే వార్త ఈ ప్రాంతంలో ఎంతగానో కలచివేసింది. దీంతో ఉద్దానంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

విశాలాంధ్ర-పలాస: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ ముఖ్య ఉద్దేశమని ఎంపీడీవో రమేష్ నాయుడు అన్నారు. శుక్రవారం వజ్రపుకొత్తూరు ఎంపీడీఓ కార్యాలయం లో రెండవ విడత ఉల్లాస్ శిక్షణా కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రమేష్ నాయుడు మాట్లాడుతూ సమాజం లో ఉన్న నిరక్షరాస్యులలైన సభ్యులు అందరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దటమే ఉల్లాస్ పథకం యొక్క ముఖ్య ఉద్దేశ్యం అని అన్నారు టీచర్ వాలంటీర్లుతో రెండో విడత శిక్షణ నిర్వహించారు వి టి(వాలంటీర్స్ టీచర్స్)లకు కేటాయించిన నిరక్షరాస్యులను స్వచ్ఛందంగా చదవడం రాయడం నేర్పాలని కోరారు అనంతరం ఎంపీడీఓ గారు, ఏపీఎం ప్రసాదరావు అభ్యసన పుస్తకాలను విటి లకు అందచేశారు ఈ కార్యక్రమం లో ఎంపీడీఓ రమేష్ నాయుడు, ఏపీఎం ప్రసాదరావు, సీసీలు, వాలంటీర్ టీచర్స్ పాల్గొన్నారు

ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

సహాయ సంచలకులు డా. పోతనపల్లి చంద్రశేఖర్

విశాలాంధ్ర-మందస: పాడి రైతులు ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పలాస సహాయ సంచాలకులు పోతనపల్లి చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మందస మరియు హరిపురం పశు వైద్యాధికారులు డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్ మరియు డాక్టర్ కిల్లి ఉమాభారతిల ఆధ్వర్యం లో పిడిమందస మరియు సాబాకోట సచివాలయాలలో నిర్వహించిన ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను పలాస ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ పోతనపల్లి పరిశీలించారు . ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పశు సంవర్ధక శాఖ ద్వారా జరుగుతున్న ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెండు సచివాలయం పరిధిలో ఉన్న గ్రామాలలో వ్యాధి నిరోధక టీకాలు వేయడం, దూడలకు అంతర పరాన్న జీవులు మందులు తాగించడం తో పాటు శిబిరనికి తీసుకువచ్చిన పశువులకు చికిత్స చేసి మందులు అందజేయడం జరిగింది. అనంతరం పాడి రైతులకు పశు పోషణ లో తీసుకోవాల్సిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, కృష్ణారావు, జగన్మోహన్ రావు, దుర్యోధన తదితర పాడిరైతులతో పాటు సిబ్బంది ధర్మేంద్ర, బాలకృష్ణ, శ్రీను, సంతోషి, హరికృష్ణ, కళ్యాణ్, నేతాజీ, లక్ష్మి, పార్వతి, రాజ్యలక్ష్మి, ఉమా, మురళి, ఇంతియాజ్, నిత్యానంద్, పురుషోత్తం మరియు ఎం ఏ వి సి సిబ్బంది, డా. దేవి, శ్రావణి, వంశీ తో పాటు పాడి రైతులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని పెద్ద ఎర్రగోవింద పుట్టుగ మండల పరిషత్ ప్రాథమిక పాతశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని హెచ్ఎం దేవదాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లకార్డులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య,సామాజిక ఎదుగుదల తదితర అంశాలపై గ్రామంలో అవగాహన కల్పించారు.విద్యార్థులచే మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పద్మ, ఎస్ఎంసి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కవిటిలో... జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా కవిటి మండల పరిషత్ ప్రాథమిక పాతశాలలో బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం బి. వరలక్ష్మి, పాతశాల ఉపాధ్యాయులు, (బ్రెడ్స్) కె ఎస్ సి ఎఫ్ కోఆర్డినేటర్ ఎం. స్వాతి, సచివాలయ సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి పాలనలో అభివృద్ధికి పెద్దపీట

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు: టిడిపి ప్రభుత్వ పాలనలో అభివృద్ధికి పెద్దపీట వేస్తారని మాజీ ఎంపీపీ గౌరకల వసంతరావు,రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వర్ రావు అన్నారు.శుక్రవారం నౌపడా అర్ అండ్ బి రహదారి గుణాలపాడు నుండి వయా తమాడపేట చిన్న గోపినాదపురం మీదుగా అమలపాడు బీటి రోడ్డు వరకు సుమారు 2.3 కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సరైన రహదారి సౌకర్యాలు లేక ఉద్దానాం గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారని అన్నారు.ప్రజల తక్షణ అవసరాలైన రహదారుల అభివృద్ధి అవసరాన్ని స్థానిక ఎంఎల్ఏ గౌతు శిరీష గుర్తించి మండలం లో కొత్తగా 11 తారు రోడ్ల ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని తెలిపారు. మహాత్మ గాంధి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 11 రహదారుల నిర్మాణానికి సుమారు రూ. 13 కోట్లు కూటమి ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. కూటమి ప్రభుత్వ హయంలో సంకేశమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు సమాన అవకాశాలు ఉంటాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉద్దానం గోపినాదపురం గ్రామ టిడిపి అధ్యక్షులు మాదనాల జోగారావు, జనసేనా మండల నాయకుడు మాదానాల మోహనరావు, టిడిపి మండల అధ్యక్షులు సూరాడ మోహన్ రావు, ప్రధాన కార్యదర్శి కర్ని రమణ,టిడిపి నాయకులు దున్న షణ్ముఖ రావు, గోవింద పాపారావు, గౌరకల వసంతరావు,వంక రామారావు,అంగ ధిల్లి రావు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు

విశాలాంధ్ర -టెక్కలి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో మంటలు చెలరేగి ప్రజలు పరుగులు తీసిన సంఘటన టెక్కలిలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలో స్థానిక పాత బస్టాండ్ సమీపంలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్ లో శుక్రవారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో ఒక్కసారిగా బ్యాంకులో దట్టంగా పొగలు వ్యాపించి మంటలు చెలరేగాయి. వెంటనే గమనించిన బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు హఠాత్తున బయటకి పరుగులు తీశారు. బ్యాంకు సిబ్బంది సిఓటి సహాయంతో మంటలను అదుపు చేసినప్పటికీ మంటలు సెగ పెరగడంతో వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారాన్ని అందజేశారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ జరగకపోవడంతో సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు. ఎస్బిఐ అధికారులకు ఈ ప్రమాదం ఎలా జరిగిందని వివరణ అడగగా... 12 గంటల సమయంలో ఖాతాదారులతో బ్యాంక్ పనుల్లో ఉండగా ఓ ఎలక్ట్రికల్ బోర్డు నుండి షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి పొగ బ్యాంకు మొత్తం వ్యాపించాయని తెలిపారు. అప్పటికే ఖాతాదారులు సిబ్బంది బయటకు వెళ్లిపోయామని, ఎవరికి ఏ ప్రమాదం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నట్లు తెలిపారు. అందుకు బ్యాంకు సేవలు నిలిపివేసినట్లు ఎస్బిఐ అధికారులు తెలిపారు. శని, ఆదివారాలు బ్యాంకు సెలవు కావడంతో షార్ట్ సర్క్యూట్ కు గురైన విద్యుత్ వైర్లను సరి చేస్తామన్నారు. సోమవారం నుంచి యధావిధిగా సేవలు అందుబాటులో ఉంటాయని బ్యాంక్ అధికారులు తెలిపారు.

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం

విశాలాంధ్ర -టెక్కలి: క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని మండల విద్యాశాఖ అధికారులు డి తులసిరావు, డి చిన్నారావు లు అన్నారు. ఈ సందర్భంగా మండలంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాతశాల చాకిపల్లిలో నియోజకవర్గం స్థాయి 77వ గ్రీగ్స్ పోటీలు ప్రారంభించారు. ఈ పోటీలలో బాలురు అండర్ 14, అండర్ 17 విభాగాల వారు కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్, టెన్నికోట్, అథ్లెటిక్స్ ఆటల పోటీలకు సుమారు 450 మంది క్రీడాకారులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడల పై ఆసక్తి చూపాలని, క్రీడలతో ఆరోగ్యం శారీరక మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చని అన్నారు. క్రీడాకారులు ఆటలతో పాటు చదువులో కూడా బాగా రాణించాలని తెలిపారు. క్రీడా ధ్రువీకరణ పత్రాలతో పాటు చదువులో కూడా మంచి మార్కులు సాధించుకుంటే భవిష్యత్తులో మంచి ఉద్యోగాల్లో కొనసాగుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాతశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం అనురాధ, సీతాపురం ప్రధానోపాధ్యాయురాలు ఎస్ వేణుకుమారి, విద్యా కమిటీ చైర్మన్ జి సునీత, మాజీ సర్పంచ్ పి తవిటయ్య, పి వసంత, బి వైకుంఠరావు, జి రాము, మీట్ ఆర్గనైజేషన్ వ్యాయమ ఉపాధ్యాయులు బి నారాయణరావు, పి తిరుపతిరావు, కేకే రామిరెడ్డి, జి శ్రీనివాసరావు, సిహెచ్ వాసుదేవరావు, తాటిపాలమ్మ తల్లి యూత్ సభ్యులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి జీ తెలుగులో ఎన్నాళ్లో వేచిన హృదయం

విశాలాంధ్ర-శ్రీకాకుళం : జీ తెలుగు మరో కొత్త సీరియల్తో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆసక్తికరమైన కథ, కథనంతో రూపొందుతున్న సరికొత్త సీరియల్ ఎన్నాళ్లో వేచిన హృదయం జనవరి 27న ప్రారంభం కానుందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. బాధ్యతలు, బంధాలే ప్రధానంగా సాగే అందమైన ప్రేమకథ ఎన్నాళ్లో వేచిన హృదయం సోమవారం నుంచి శనివారం వరకు మధ్యాహ్నం 2:30 గంటలకు, మీ జీ తెలుగులో ప్రసారమవుతుందాన్నారు. ఎన్నాళ్లో వేచిన హృదయం సీరియల్ త్రిపుర (తన్వియ) అనే ఒక స్కూల్ టీచర్, వ్యాపారవేత్త అయిన బాలకృష్ణ(చందు గౌడ) మధ్య సాగే కథతో రూపొందుతోందన్నారు. కారు ప్రమాదంతో మానసిక వైకల్యానికి గురైన బాలకృష్ణ ఆరోగ్యం బాగుపడేందుకు అతణ్ని రామాపురం తీసుకొస్తారన్నారు. కుటుంబ బాధ్యతలతో సాగుతున్న త్రిపుర జీవితం బాలతో ఎలా ముడిపడుతుంది? ఇద్దరి జీవితాల్లో వచ్చే సమస్యలేంటి? అనే విషయాలు తెలుసుకోవాలంటే జీ తెలుగులో ప్రసారమయ్యే ఎన్నాళ్లో వేచిన హృదయం సీరియల్ని మిస్ కాకుండా చూసేయలన్నారు. చందు గౌడ, తన్వియ ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, ముంతాజ్, లక్ష్మణ్, ఉమ, కౌశల్, ప్రసాద్, కరాటే కల్యాణి, విశ్వ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. అద్భుతమైన కథాంశం, ఆసక్తికరమైన మలుపులతో సాగే ఎన్నాళ్లో వేచిన హృదయం సీరియల్ మీరూ తప్పక వీక్షించాలన్నారు.

ఓటర్ల దినోత్సవం జరుపుకున్న జె బి టి పాఠశాల విద్యార్థులు

విశాలాంధ్ర-జలుమూరు : ఈనెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ముందస్తుగా సారవకోట మండలం అవలింగి జేబిటి పాతశాల విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా వివిధ రకాల పుష్పాలతో రంగవల్లి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో విలువైనది ఓటు అని అటువంటి నేడు జరగబోయే ఈ దినోత్సవాన్ని పురస్కరించుకొని ముందస్తుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాతశాల వ్యవస్థాపకులు జోగు మహంతి మోహన్ గాంధీ అన్నారు. ఆయనతోపాటు విద్యార్థిని, విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఊడిపోయిన ఉడికలపాడు రోడ్డు ప్రయాణానికి ఇబ్బంది

విశాలాంధ్ర -జలుమూరు: అనేక గ్రామాల రహదారుల అభివృద్ధి చెందుతున్న ఈ రోజుల్లో జలుమూరు మండలం ఊడికలపాడు ప్రధాన రహదారి పూర్తిగా పాడైందని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. అబ్బాయిపేట జంక్షన్ నుండి టి ఎల్ పాడు వయా ఉడికలపాడు గ్రామం మీదుగా వెళ్లే తారు రోడ్డు పూర్తిగా అధ్వానంగా తయారైందని ఆ ప్రాంత ప్రజలు రోడ్డు వెంబడి ప్రయాణం చేసే వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. గతంలో ఈ రహదారి విషయాలు ఎవరూ పట్టించుకోకపోవడం ఇంత దారుణానికి ఒడిగట్టిందని పలువురు స్పష్టం చేశారు స్థానిక శాసనసభ్యులు పరిశీలించి ఈ రహదారి నిర్మాణాన్ని కృషి చేస్తారని ఆయా ప్రాంత గ్రామ ప్రజలు కోరుచున్నారు.

గ్రానైట్ కార్మికులకు భద్రత కల్పించాలి

విశాలాంధ్ర-టెక్కలి : తక్షణం కేంద్ర కార్మిక శాఖా అధికారులు గ్రానైట్ మైన్స్ లో పనిచేస్తున్న కార్మికుల భద్రత, హక్కుల చట్టాలు అమలు జరిగేలా చూడాలని జిల్లా గ్రానైట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి నంబూరు షణ్ముఖరావు డిమాండ్ చేశారు. గ్రానైట్ సంక్షోభం పేరుతో గ్రానైట్ కార్మికులకు అరకొర జీతాలు చెల్లిస్తూ యాజమాన్యాలు తీవ్ర దోపిడీకి పాల్పడుతున్నాయని అన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే నేడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా కార్మిక సమస్యలు ను పట్టించుకోవడం లేదని, కార్మిక చట్టాలు అమలు చేయకపోయిగా, డిపార్ట్మెంట్ లు కార్యాలయాలకు పరిమితం చేసారని అన్నారు. తక్షణం సెంట్రల్ లేబరు అధికారులు జోక్యం చేసుకుని కార్మిక చట్టాలను అమలు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో మధుఖాన్ ఎంటర్ ప్రైజెస్ అండ్ ఎంటర్ ప్రైజింగ్ కంపెనీలు కార్మికులుకు జీతాలు, ఇతర బకాయిలు చెల్లించాల్సి ఉందని అన్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరి వల్లనే కార్మిక చట్టాలు అమలు కాక కార్మికులు నష్టపోతున్నారని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో యం.క్రిష్ణారావు, కె.మధుసూధన రావు, రాజారావు, సూర్యనారాయణ, అన్నెపు అప్పారావు, ఉమాపతి, పట్నాయక్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలిక దినోత్సవం

విశాలాంధ్ర-జీసిగడాం/పొందూరు: మండలం సంతవురిటి గ్రామంలో బెజ్జిపురం యూత్ క్లబ్ స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో పాతశాల సంసిద్ధత మరియు బా లావికాస్ ప్రోగ్రాం లో భాగంగా శుక్రవారం జి. సిగడాం మండలంలోని, సంతవురిటీ అంగన్వాడి కేంద్రాలతోపాటు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జాతీయ బాలికా దినోత్సవంఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బెజ్జిపురం యూత్ క్లబ్ కమ్యూనిటీ ఆర్గనైజర్ కాళ్ల శ్రావణి మాట్లాడుతూ జాతీయ బాలికా దినోత్సవంప్రాముఖ్యతతో పాటు విద్య, ఆరోగ్యం, పోషకాహారం, లింగ అసమానత ,వంటి విషయాలను గురించి బాలల హక్కుల గురించి సమాజంలో జరుగుతున్న అక్రమాలు, అన్యాయాల గుర్చి క్లుప్తంగా వివరించారు.ఈ కార్యక్రమంలో సంతవురిటీ జిల్లా పరిషత్తు పాతశాల ప్రధానోపాధ్యాయురాలు టీ .జయ లక్ష్మీ, బెజ్జి పురం యూత్ క్లబ్ కమ్యూనిటీ ఆర్గనైజర్ పి.అప్పలనాయుడు, మహిళా పోలీస్, ఏం ఎల్ హెచ్ పి,సి హెచ్ ఓ, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు అంగన్వాడి కార్యకర్తలు, అంగన్‌వాడీ సహాయకులు, సంతవురిటీ హై స్కూల్ బాలికలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలో కొండ ములగాం ప్రభుత్వ ఆదర్శపాతశాల లో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. చిత్రలేఖనం పోటీ ఆదిలక్ష్మి మరియు ఉదయకుమారి ఉపాధ్యాయినులు, వక్తృత్వపు పోటీని దిలీప్, ప్రసాద్ పర్యవేక్షించారు. పర్యటించి బాల, బాలికలు వేసిన చిత్రలేఖనం మరియు వక్తృత్వపు పోటీలు పరిశీలన చేశారు అంతేకాకుండా బాలికల హక్కులగురించి మాట్లాడారు.అలాగే అప్పిరియల్ గదిలో విద్యార్థులు చేసిన, వేసిన చిత్రపటాలు చాలా బావున్నాయని ఒకేషనల్ టీచర్ ని అభినందించారు. పిల్లల క్రమశిక్షణ పోటీతత్వం చూసి హర్షం వ్యక్తం చేస్తూ ప్రిన్సిపాల్ పొట్నూరు. శ్రీధర్ ను ప్రశంసిస్తూ మీ నిర్వహణలో పాతశాల అన్నీ రంగాల్లో అద్భుత విజయాలు సాధిస్తుందని కొనియాడారు. వీరితోపాటు ఐ. సి. డి. ఎస్ సూపరింటెండెంట్ మంగమ్మ పి. కృష్ణ, సూర్యప్రకాష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇది కేవలం ఉపాధి వరకే పనులు... అభివృద్ధి కోసం కాదు... సర్వత్ర విమర్శలు

విశాలాంధ్ర-జలుమూరు: సుమారు రెండు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యక్రమం ద్వారా కోట్లాది రూపాయలు ప్రతి ఏటా ఖర్చు చేస్తూనే ఉన్నారు పనులు జరుగుతూనే ఉన్నాయి. ఉపాధి కల్పిస్తూనే ఉన్నారు. అక్కడ జరిగే పనులు మాత్రం అభివృద్ధి కనిపించడం లేదని విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. జలుమూరు, సారవకోట మండలాలో గత 20 సంవత్సరాలుగా వందలాది చెరువులు ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టారు. ప్రతి చెరువుకి లక్షలాది రూపాయలు నిధులు మంజూరయ్యాయి. ఒక చెరువు 20 సంవత్సరాల్లో లక్షల ఖర్చు చేసినట్లు రికార్డుల్లో చూపుతున్నారు. నేటికీ గ్రామస్థాయిలో ఆ చెరువుల పరిస్థితి చూస్తే అట్లాగే కనిపిస్తూ ఉన్నాయి. ఉపాధి పని ఉపాధి కోసమేనా తప్ప అక్కడ చెరువుల అభివృద్ధి జరగవా అనే విమర్శలు వినిపిస్తున్నాయి. 2004లో ప్రారంభమైన ఈ పథకం వంచలుగా నిధులు మంజూరు అవుతూనే ఉన్నాయి. ప్రతి గ్రామంలో వందల సంఖ్యలో ఉపాధి కూలీలు గుర్తించి ఉన్నారు వీరందరికీ నిధులు అందుతూనే ఉన్నాయి గాని ఆ గ్రామాల్లో చెరువులు అభివృద్ధి చంద లదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ పథకంపై పాలకులు జిల్లా స్థాయి అధికారులు పరిశీలించి ఖర్చుపెట్టిన నిధులుకైన అక్కడ అభివృద్ధి జరిగేటట్లు చూడాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయంపై అధికారులు వివరణ కోరగా ఉపాధి పనులు జరుగుతున్నాయని చెప్తున్నారు.

అలరించిన గీతావధానం

- అవధానం ఏకాగ్రతకు ప్రతీక
- గురజాడ విద్యా సంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: అవధానం అనేది ఏకాగ్రతకు ప్రతీకని, విద్యార్థులకు ఇది ఎంత గానో అవసరమని గురజాడ విద్యా సంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు అన్నారు. గాయత్రి కాలేజీ అఫ్ సైన్స్ అండ్ మేనేజ్ మెంట్ కళాశాల తెలుగు విభాగం, ఐక్యూ.ఏ.సి. సంయుక్తంగా తిరుపతికి చెందిన ప్రముఖ గీతావధానిచే ఏర్పాటు చేసిన గీతావధానం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సపాల్ డా.వులఖండం శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలనంతో ప్రారంభించి, అవధాన ప్రక్రియలో వివిధ రకాలను వివరించారు. సభా నిర్వహణ బ్రహ్మశ్రీ బంకుపల్లె రమేశ్ శర్మ, అప్రస్తుత ప్రసంగం ప్రముఖ శతావధాని రంప సాయి కుమార్ పృచ్ఛకులుగా కళాశాలకు చెందిన విద్యార్థులు సుప్రియ, సిరిచందన, లక్ష్మి, శిరీషా పండిట్, నాన్సీ, మేఘవర్షిని, నాగ లక్ష్మి వ్యవహరించారు. అనంతరం అవదానిని విద్యా సంస్థలు అధినేత ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.వి.వి. సత్యనారాయణ, ఐక్యూ.ఏ.సి. సమన్వయకర్త డా. మార్థండ కృష్ణ, తెలుగు విభాగం గౌరీ శంకర్, అప్పలనాయుడు, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

సెకెండ్ షిఫ్ట్ రిజర్వేషన్ కౌంటర్ పునః ప్రారంభం

జెడ్ఆర్‌యుసిసి సభ్యుడు శ్రీనివాస్ రౌలో

విశాలాంధ్ర -కవిటి: సోంపేట రైల్వే స్టేషన్లో సెకండ్ షిఫ్ట్ రిజర్వేషన్ కౌంటర్ పునః ప్రారంభించినట్లు జెడ్ ఆర్ యు సి సి సభ్యుడు శ్రీనివాస్ రౌలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారుగా గత 4 నెలల నుండి సోంపేట రైల్వే స్టేషన్లో రిజర్వేషన్ కౌంటర్ రెండవపూట ఆపివేయడం జరిగిందన్నారు ఈ సమస్య పై తాను పదవి బాధ్యతలు చేపట్టిన అనంతరం సెకండ్ షిఫ్ట్ రిజర్వేషన్ కౌంటర్ పునః ప్రారంబించటానికి డి ఆర్ ఎం కుర్ధా రోడ్డు కార్యాలయం కి వెళ్లి సీనియర్ డీసీఎం ను కలసి వినతి పత్రం అందజేసి అభ్యర్థించడం జరిగిందని తెలిపారు. ఇటీవల ఇచ్ఛాపురం లో రైల్వే అభివృద్ధి పనులు పరిశీలన కి వచ్చిన డి ఆర్ ఎం, హెచ్.బి సింగ్ ను కలసి సమస్య ను దృష్టి లో పెట్టడం జరిగిందని అన్నారు. ఈ క్రమంలో రిజర్వేషన్ కౌంటర్ పునః ప్రారంభం కు ఉత్తర్వులు రావడం ఆనందంగా ఉందని తెలిపారు. ఉత్తర్వులు మంజరు చేసినందుకు రైల్వే అధికారులకు ఆయన కృతజ్ఞతలు చేశారు.

పారా లీగల్ వాలంటీర్ల నియామకానికై దరఖాస్తుల ఆహ్వానం

- సీనియర్ సివిల్ జడ్జి జే.శ్రీనివాసరావు.

విశాలాంధ్ర-టెక్కలి: ఆసక్తి గల అభ్యర్థులు పారా లీగల్ వాలంటీర్లు నియామకానికై దరఖాస్తుల ఆహ్వానించినట్లు సీనియర్ సివిల్ జడ్జి జే శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేయాలనుకున్న వారు 10వ తరగతి, మెట్రిక్యులేషన్ కనీస అర్హత కలిగి ఉండాలని, టెక్కలి నందిగాం, మెలియాపుట్టి, రెవెన్యూ మండలాల పరిధిలో నివాసితులై ఉండాలని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు రెండు పాస్ ఫోటోలు, ఆధార్ కార్డు, విద్యా సంబంధిత పత్రములతో మండల న్యాయసేవాధికారి సంఘం కార్యాలయానికి ఉదయం 10:30 నుండి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు తీసుకోబడుతున్నట్లు తెలిపారు. ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తులు సమర్పించుకోవాలని తెలిపారు. ఈ పారా లీగల్ వాలంటీర్లుగా నియమితులైన వారికి ఎటువంటి జీతభత్యములు గాని, పారితోషకములు గాని, వేతనాలు గాని చెల్లించబడవని ఆయన తెలిపారు.

ఓటు వజ్రాయుధం వంటిది : ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు

విశాలాంధ్ర -కవిటి: ఓటు వజ్రాయుధం వంటిదని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పేడాడ రాజేశ్వరరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్. ఆధ్వర్యంలో 25 న జరగబోయే జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పేడాడ రాజేశ్వరరావు మాట్లాడుతూ ఓటు వజ్రాయుధం వంటిదని, సరైన పద్ధతిలో దానిని వినియోగిస్తే సరైన ప్రభుత్వాన్ని ఎన్నుకుని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించవచ్చని అన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్. పి.ఒ. జె. పాపారావు, జి. విష్ణు మూర్తి, పి. హరి, కె .ఉగాది నాయుడు, బి.శ్రీను బాబు, డి. అనసూయ, కె. కరుణశ్రీ, బి.రమేష్, ఎల్. ఆనంద్, బి.అంజనా, విద్యార్థులు పాల్గొన్నారు.

బంగారు దుకాణాలే లక్ష్యంగా చోరీలు

- దున్న రవి షాపు నుండి వెండి బంగారం అపహరణ..మరో దుఖాణంపై దాడికి యత్నం
- చోరీ లో ఏడుగురు పాల్గొన్నట్లు సిసి కెమెరాలలో రికార్డులు
- రూ 20 లక్షలు విలువ చేసే 9.8 కిలోల వెండి 9 తులాల బంగారం దొంగిలించినట్లు గుర్తింపు

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : వ్యాపార కేంద్రమైన పూండిలో దొంగలు బీభత్సం సృష్టించారు. బంగారుషాపులే లక్ష్యంగా ఏడుగురు వ్యక్తులు చోరికి పాల్పడినట్లు సిసి కెమెరా ఫుటేజ్లో రికార్డులు నమోదయ్యాయి. దున్న రవికి చెందిన బంగారు దుఖాణం యొక్క తలుపులు పగలగొట్టి బంగారు, వెండి అపహరణకు పాల్పడ్డారు. అలాగే ఆర్కే జూలయర్స్ షాపు తలుపులు పగలగొట్టడానికి ప్రయత్నించారు. అయితే తలుపులు ఊడకపోవడంతో దొంగలు అక్కడ నుండి పరారయ్యారు. గురవారం రాత్రి సుమారు 2 గంటల సమయంలో ఏడుగురు దొంగలు పెద్దపెద్ద కట్టర్లు. ఇనపరాడ్లుతో దున్న రవికి చెందిన బంగారషాపు పగలు గొట్టినట్లు సిసి పుటేజ్ లు ద్వారా తెలుస్తుంది. దొంగలించిన సొత్తును సమీపంలో ఉన్న చెరువుగట్టుపై ఆగి ఆభరణాలు మూటగట్టి వాటియొక్క కవర్లు, బాక్సు చెరువు గట్టువద్ద దొంగలు విడిచి పెట్టారు. శుక్రవారం ఉదయం దుఖాసం తలుపులు వగలు గొట్టి ఉండడంతో షాపు యజమాని పోలీసులకు సమాచారం అందించారు. వజ్రపుకొత్తూరు ఎస్ఐ బి నిహార్, కాశీబుగ్గ రూరల్ సిఐ తిరుపతిరావులు సంఘటనా స్థలంకు చేరుకొని పరిశీలన చేసి క్లూస్ టీం కు

సమాచారం అందించగా వారు వచ్చి షాపును క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. బాధితులు నుండి వివరాలు సేకరించారు. బాదితుడు దున్న రవి బంగారం దుఖాణం పైన ఉన్న ఇంటిలోనే నివాసం ఉంటున్నారు. దీంతో బంగారం, వెండి సామానులు షాపులోను ఉంటాయని షాపు యజమాని రవి చెప్పారు. అయితే క్లూస్ టీం తనిఖీలో కొంతబంగారం, వెండి షాపులోనే ఉన్నట్లు గుర్తించి వాటిని యాజమానికి అప్పటించారు. కాగా 9.8 కెజీల వెండి, 9 తులాల బంగారం దొంగలు ఎత్తుకు పోయారని ఎస్ బి నిహార్ చెప్పారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సంఘటనతో పూండివానులు హడలిపోతున్నారు. పూండి చరిత్రలో బంగారం దుణానాలపై ఎప్పుడు దొంగలు దాడికి పాల్పడలేదని చెబుతున్నారు. ఏడుగురు దుండగులు ఇనపరాడ్లు, కత్తెర్లతో షాపులపై దాడికి పాల్పడినట్లు సిసి కేమేరాలలో రికార్డులు అయిన నేపథ్యంలో దుంగలు ఎప్పటినుండో మాటువేసి ఉంటారనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దుండగులు ద్విచక్రవాహనంపై వచ్చి దొంగతనానికి పాల్పడడంతో వీరు రిక్కి నిర్వహించి ఉంటారని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పూండి శివాలయంలో వెండివస్తులు చోరికి పాల్పడగా ఎస్ఐ నిహార్ ఆధ్వర్యంలోనే దొంగలను పట్టుకొని వెండివస్తులు రికవరీ చేసిన నేపథ్యంలో ఈ సారీకూడాదదొంగలను పట్టుకుంటారనే అభిప్రాయం వ్యక్తం చేసారు.